స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ప్లకార్డులతో ఓటుపై అవగాహన కల్పిస్తున్న కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి సభ్యులు

వనస్థలిపురం: ఓటరు మేలుకో.. ఓటు విలువ తెలుసుకో అంటూ కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం డివిజన్లలో ప్రధాన కూడళ్లలో ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఆంజనేయులు మాట్లాడుతూ, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు. సంస్థ సభ్యులు వంశీ, పవన్, కృష్ణ, హరిబాబు, అంజి పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన



పెద్దచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మన్సూరాబాద్: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ఐక్య ఉద్యమ వేదిక ఫౌండర్ మునగాల హరీశ్‌రెడ్డి మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధాన ఆయుధమని, యువత నిర్లక్ష్యపు ధోరణిని వీడి ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన ఫ్లెక్సీలో పేర్కొన్నారు.

ఓటమి భయంతో కేటీఆర్ నిరుద్యోగుల జపం

- యుద్ధం చేయాలని కత్తి ఇస్తే అస్త్రసన్యాసం చేసిన సుధీర్‌రెడ్డి
- ఎల్బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి

ఎల్బీనగర్/మన్సూరాబాద్: ఓడిపోతున్నామనే భయంతో తొమ్మిదేళ్లలో గుర్తుకురాని నిరుద్యోగులు మంత్రి కేటీఆర్‌కు ఇప్పుడు గుర్తుకు వచ్చారని, ఓటమి భయంతోనే నిరుద్యోగుల జపం చేస్తున్నారని బీజేపీ ఎల్బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి మండిపడ్డారు. బీఎన్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ యువతను నిర్వీర్యం చేసిందని, ఇన్నాళ్లూ గుర్తుకు రాని జాబ్ కేలండర్ ఇప్పుడు గుర్తుకు రావడం తెలంగాణ యువత విజయ సంకేతమన్నారు. టీఎస్‌పీఎస్సీలో అవకతవకలు జరిగాయిని, పూర్తిస్థాయిలో ప్రక్షాలన చేయాలని బీజేపీ పోరాటం చేసిన కేసీఆర్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. నేడు అధికార పార్టీ పెద్దలు ప్రక్షాళన చేస్తామని పేర్కొంటున్నారంటే టీఎస్‌పీఎస్‌లో అవకతవకలు జరిగాయనడానికి నిదర్శనమన్నారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలను నట్టేట ముంచిన కేటీఆర్ నేడు నంగనాచి మాటలను నిరుద్యోగులు నమ్మే స్థితిలో లేరన్నారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ని కాదని ప్రజాకూటమి మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థిని ఎల్బీనగర్ ప్రజలు గెలిపించి అధికార పార్టీపై యుద్ధం చేయాలని సుధీర్‌రెడ్డికి కత్తి ఇచ్చారని, నియోజకవర్గ ప్రజలను మోసం చేసి అస్త్ర సన్యాసం చేసి అధికార పార్టీకి అమ్ముడుపోయాడని ఆరోపించారు.



ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో కలిసి ఓటు అభ్యర్థిస్తున్న సామ రంగారెడ్డి

- బీజేపీ అభ్యర్థి రంగారెడ్డికి నాయీ బ్రాహ్మణుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్ణయాన్ని ప్రకటించారు.
- మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఇందిరానగర్, గణేష్‌నగర్ తదితర కాలనీలలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కొత్తపేటలో ..

నాగోలు: ఎల్బీనగర్ బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి గెలిపించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. మంగళవారం కొత్తపేట డివిజన్ న్యూ మారుతి నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ నుంచి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

మార్పు కోసం బీజేపీని గెలిపించాలి
- ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

ఎల్బీనగర్: రాష్ట్రంలో నిరంకుశ నయా నిజాం పాలన నడుస్తోందని, మార్పు కోసం బీజేపీని గెలిపించాలని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఎల్బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో మంగళవారం చేపట్టిన పాదయాత్రకు ఏవీఎన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత 16 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్న సౌమ్యుడు సామ రంగారెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నాయకులు రాజిరెడ్డి, శంకరయ్యగౌడ్, రఘురామ్‌నేత, సందీప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శశశంకర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్, నారాయణ, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



బీఎన్‌రెడ్డి నగర్‌లో సామ రంగారెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళ



సామ రంగారెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న నాయీ బ్రాహ్మణులు



కొత్తపేట డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

అవకాశమివ్వండి..అభివృద్ధి చేసి చూపిస్తా..

యాకుత్‌పురా బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి



కొబ్బరి బొండం కొడుతూ ఓటు అడుగుతున్న సుందర్‌రెడ్డి

సైదాబాద్: యాకుత్‌పురా ప్రజలు తనను ఆదరించి ఎన్నికల్లో ఒకసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో ఇంటింటికీ తిరిగి పార్టీ కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాతబస్తీ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని నమ్ముతున్న యాకుత్‌పురా వాసులు తనను గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మజ్లిస్‌కు అండగా నిలవండి: అసదుద్దీన్ ఒవైసీ



మలక్‌పేటలో ప్రచారం చేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, అభ్యర్థి బలాల

మలక్‌పేట: అభివృద్ధి కొనసాగింపు కోసం మజ్లిస్ పార్టీకి అండగా నిలవాలని ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మలక్‌పేట అభ్యర్థి అహ్మద్ బలాలతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో పాదయాత్ర చేశారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తూ పతంగి గుర్తు ఓటేసి బలాలను గెలిపించాలని ఓటర్లను కోరారు. 30 తేదీన ఓటర్లందరూ ఓటేసి ఓటింగ్ శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే మలక్‌పేట అభివృద్ధి

పార్టీ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి



సైదాబాద్‌లో కరపత్రాలు పంచుతూ ఓటు అభ్యర్థిస్తున్న తీగల అజిత్‌రెడ్డి

సైదాబాద్: మలక్‌పేట సమగ్రాభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని పార్టీ నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తిరుమలాహిల్స్ కాలనీలో ఇంటింటికి పార్టీ కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుస్థిర పాలన కాంక్షిస్తున్న మలక్‌పేట ప్రజలు తనను ఈసారి ఎన్నికల్లో గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కె.భూమేష్, డివిజన్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరాములు యాదవ్ గెలుపు ఖాయం



అందెల సమక్షంలో బీజేపీలో చేరిన పలువురు

- బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్

మహేశ్వరం: మహేశ్వరంలో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ గెలుపు ఖాయమని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యులు బస్వ పాపయ్య గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న సబితారెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిలు వలస నేతలన్నారు. చేవెళ్ల నుంచి మహేశ్వరానికి వలస వచ్చి పోటీ చేస్తున్నారన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి స్థానికుడు, బీసీ బిడ్డ అయిన అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవచారి, మండల బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగురవేస్తాం..

కందుకూరు: మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని తిమ్మాపూర్, జైత్వారం, దెబ్బడగూడ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీ నాయకులు రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రమేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు 35 బృందాలు

ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గంలో దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఇందు కోసం నియోజకవర్గంలో 35 బృందాలను నియమించామని రిటర్నింగ్ అధికారి పంకజ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ముందుగా తమ పేర్లను నమోదు చేసుకున్న వారికి మాత్రమే వారి ఇంటివద్దకే సిబ్బంది వెళ్లి ఓటింగ్ చేయించుకుంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 422 మంది ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు సుమారుగా 260 మంది ఓటింగ్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. ప్రశాంత్‌నగర్ నివాసి రాటకొండ తులసమ్మ వయస్సు 90 సంవత్సరాలు కావడంతో ఆమెకు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చారు. మంగళవారం ఆమె ఇంటి వద్దకు పోలింగ్ అధికారులు వెళ్లి ఆమెతో ఓటు వేయించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద పోలీసుల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్నికల బందోబస్తులో పాల్గొంటున్న సిబ్బంది ముందుగా ఇక్కడ తమ ఓటు వినియోగించుకుంటున్నారు.



చాణక్యనగర్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న సుబ్రహ్మణ్యం, సరస్వతి

క్రైం కార్నర్..

వివాహిత హత్య కేసులో.. అత్త, మరిదికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: కోడలిపై కిరోసిన్ పోసి హతమార్చిన కేసులో ప్రధాన నిందితుడైన మామ చనిపోగా, అత్త, మరిదిలకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష తోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.సతీష్ కుమార్ మంగళవారం తీర్పు ఇచ్చారు. కోర్టు ఏపీపీ గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నక్క మహేశ్, మంజు దంపతులకు ఒక కుమార్తె సంతానం. కాగా 2014లో మహేశ్‌ను సమీప బంధువులు హతమార్చారు. హతుడి కూతురు పేరిట రూ.3.50 లక్షల పరిహారంగా బ్యాంకులో జమ చేశారు. ఇలా ఉండగా, మంజుల పెద్దగోల్కొండలోని తన అత్తగారి ఇంట్లో ఉంటూ కూతురి పోషణ కోసమని రావిర్యాలలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేసేది.

- ఈ క్రమంలో ఆమెపై అనుమానం పెంచుకున్న అత్తమామలు, మరిది.. బ్యాంకులో ఉన్న నగదుతో పాటు నెలవారి జీతం తమకు ఇవ్వాలని మంజులతో పలుమార్లు గొడవపడ్డారు. ఇదే విషయమై జూలై 20, 2017న మళ్లీ గొడవ పడి మంజులపై కిరోసిన్ పోసి నిప్పంటించారు. కాలిన గాయాలతో ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత బాధితురాలు మృతి చెందింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంజుల ఇచ్చిన మరణ వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగా ప్రధాన నిందితుడైన మామ మల్లేశం చనిపోగా, అత్త శంకరమ్మ, మరిది నక్క రమేశ్‌లకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష తోపాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారు.

మెట్రోరైల్ ప్రాజెక్ట్ ప్రారంభించింది కాంగ్రెస్సే



ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌లో ప్రయాణికులతో ముచ్చటిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

- పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్
- మెట్రోలో ప్రయాణిస్తూ వినూత్న ప్రచారం



మెట్రో రైలులో ప్రయాణికులతో మాట్లాడుతున్న మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో మెట్రో ప్రాజెక్ట్‌ను ప్రారంభించిందని ఆ పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన ఎల్బీనగర్ నుంచి మెట్రో రైలులో ప్రయాణించి వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐటీ ప్రొఫెషనల్స్, ఇతర ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విజనరీ పార్టీ అని, ఏ ప్రాజెక్ట్ రూపొందించినా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉంటుందని అన్నారు. బీఆర్‌ఎస్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ రెండేళ్లకే ప్రమాద దశకు చేరుకుందని, జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో కాంగ్రెస్ కట్టిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఇప్పటికీ చెక్కు చెదరలేదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కమీషన్లు దండుకుంటోందని ఆరోపించారు. మీ పిల్లల భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరారు.

1969 తెలంగాణ ఉద్యమకారుల మద్దతు...

తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ కాంగ్రెస్ పార్టీని నమ్ముతున్నామని, ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నామని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయినప్పటికీ తమ డిమాండ్లపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, తమను కలవడానికి కూడా ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ ఇవ్వలేదని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు, ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళి, మారం సంతోష్‌రెడ్డి, వెంకటయ్య, చంద్రారెడ్డి, భాస్కరశర్మ, బాలయ్య, గణేష్, యుగంధర్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోను వందశాతం అమలు చేస్తాం...

హయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుందని, ప్రకటించిన మేనిఫెస్టోను తప్పకుండా అమలు జేస్తామని ఆ పార్టీ మేనిఫెస్టో కమిటీ నాయకులు అన్నారు. మంగళవారం వనస్థలిపురంలో కమిటీ సభ్యులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ప్రొ. జానయ్య, అల్లం భాస్కర్, స్పోక్స్ పర్సన్ వెదిరె యోగేశ్వర్‌రెడ్డి, పోరెడ్డి నాగమణిరెడ్డి కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేసి, అందులోని అంశాలను వివరించారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం: షేక్ అక్బర్



అజంపురాలో యువకుడిని ఓటు అభ్యర్థిస్తున్న షేక్ అక్బర్

చాదర్‌ఘాట్: ఈసారి ఎన్నికల్లో మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి అజంపురా డివిజన్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను ఓటర్లకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. నాయకులు రాహుల్‌సింగ్, కిషన్‌సింగ్, అలీఖాన్, బాలరాజ్, సాగర్, సుమిత్ పాల్గొన్నారు.

మైనారిటీల చూపు బీజేపీ వైపు...

యాకుత్‌పురా అభ్యర్థి వీరేందర్‌యాదవ్



చంద్రయ్య హట్స్‌లో ప్రచారం చేస్తున్న వీరేందర్‌యాదవ్

చంచల్‌గూడ: ట్రిపుల్ తలాఖ్ రద్దు వల్ల మైనారిటీ మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి వీరేందర్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన కుర్మగూడ డివిజన్‌లోని పూలతోట, కుర్మగూడ, చంద్రయ్య హట్స్ బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం మొత్తం అభివృద్ధి జగుతున్నా పాతబస్తీలో అభివృద్ధి జరగడం లేదని, మైనార్టీలు ఎంఐఎం పార్టీని నమ్మడే లేదన్నారు. ఈసారి మైనార్టీలు పెద్ద ఎత్తున బీజేపీకి ఓటు వేయనున్నట్లు తెలిపారు.

ఎకరానికి రూ.16 వేల పంట పెట్టుబడి ఇస్తాం



మన్సాన్‌పల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

- మహేశ్వరం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు బంధు కింద పట్టా పాసు బుక్ ఉన్న ప్రతి రైతుకు ఎకరానికి రూ.16 వేలు పంట పెట్టుబడి సాయం అందిస్తామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని డబిల్‌గూడ, మన్సాన్‌పల్లి, కొత్త తండా, ఉప్పుగడ్డ తండా, కావలోనిబాయి తండా, గంగారం తండా ,గంగారం, సిరిగిరిపురం, హర్షగూడ గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ లీడర్లు, ఒక రియల్ లీడర్ మధ్య పోరు జరుగుతోందన్నారు. కుట్రలు పన్ని రైతు బంధు ఆపేయించిన కాంగ్రెస్, సీఎం కిసాన్ సమ్మాన్‌ను ఎందుకు అడ్డుపడ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి రైతు విరోధిగా వ్యవహరిస్తోందన్నారు. నల్ల చట్టాలు తెచ్చి ఢిల్లీ శివారులో రైతులను నానా తిప్పలు పెట్టిన పార్టీల నాయకులు కూడా నేడు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు వస్తాయన్నారు. సీఎం కేసీఆర్ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారను. పట్లోళ్ల, తీగల కుటుంబాలు ఒక్కటయ్యాయని మహేశ్వరంలో ఇక బీఆర్‌ఎస్‌కు తిరుగులేదని మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, కార్యదర్శి అంజయ్య ముదిరాజ్, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను దోచుకుంటున్న బీఆర్‌ఎస్

- మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్



కటికపల్లిలో కేఎల్‌ఆర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

కందుకూరు: దోచుకునే బీఆర్‌ఎస్ పార్టీ కావాలో, సేవ చేసే కాంగ్రెస్ పార్టీ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని మహేశ్వరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని 14 గ్రామాల్లో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ, హస్తం గుర్తుపై గెలిచిన సబితారెడ్డి మంత్రి పదవి కోసం బీఆర్‌ఎస్‌లో చేరి కాంగ్రెస్ కార్యకర్తలను మోసం చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో భూకబ్జాలు పెరిగిపోయాయని, గూండాయిజం, స్నేక్ గ్యాంగ్ అరాచకం, మర్డర్లు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో గ్రీన్ జోన్, బఫర్ జోన్ పెట్టించి, చేవెళ్లలో జీఓ 111ను ఎత్తి వేయించారని విమర్శించారు. లీడ్ ఇండియా, కేఎల్‌ఆర్ ట్రస్ట్ పెట్టి 30 ఏళ్లుగా తాను సేవ చేస్తున్నానని, ఎంతో మందికి ఉద్యోగాలు ఇప్పించానన్నారు. మరి మీరు ఎన్ని కొత్త కంపెనీలు పెట్టించి, ఎంత మందికి ఉద్యోగాలు ఇప్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. మనకు వైఎస్‌ఆర్ పాలన తిరిగి రావాలంటే కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేలా ఓట్లు వేసి దొరల పాలనకు చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సరికొండ మల్లేష్, అందుగుల సత్యనారాయణ, ఎస్.పాండు, మదన్‌పాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరన్న, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతున్నదని, ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి (సూరి), చంద్రమౌళి (చందు), దాస్, మున్నా, ఖలీల్, ఫెరోజ్ తదితరులు భారీసంఖ్యలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు దేప భాస్కర్ రెడ్డి, పున్న గణేష్ నేతా, చిలుక ఉపేందర్ రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావాలి

దిల్‌సుఖ్‌నగర్: పేదల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచెన్నగారి లక్ష్మారెడ్డి సతీమణి విజయలక్ష్మి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళ మాజీ అధ్యక్షురాలు తమలపాకుల హర్షలత అన్నారు. మంగళవారం ఆర్కేపురం డివిజన్‌లోని చిత్రలేఅవుట్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్‌లలో కేఎల్లార్‌కు మద్దతుగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.